

దరఖాస్తులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్

కార్మిక సంక్షేమ పథకాలపై అవగాహన



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్

సుభాష్‌నగర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): భవన, ఇతర నిర్మాణ కార్మికుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఉప కార్మిక కమిషనర్ కోల ప్రసాద్ తెలిపారు. అవగాహన కార్యక్రమాలపై రూపొందించిన పోస్టర్‌ను అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ సోమవారం ఆవిష్కరించారు. ఈ నెల 24 నుంచి డిసెంబరు 3 వరకు అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్మికుల వివరాలు రిజిస్ట్రేషన్, రెన్యూవల్ చేస్తామని, వారి నుంచి ఫిర్యాదుల స్వీకరిస్తామన్నారు. కార్మికులకు ప్రమాద బీమా ఆర లక్షల నుంచి 10 లక్షలు, సహజ మరణానికి లక్ష రూపాయల నుంచి రెండు లక్షల రూపాయలకు పెంచారని తెలిపారు. అంగవైకల్యం పథకాలను ఇన్సూరెన్స్ కంపనీ ద్వారా అమలు చేస్తారన్నారు. పెళ్లి కానుక, ప్రసూతి లబ్ధి, తాత్కాలిక వైద్య సహాయం, ఆరోగ్య పరీక్షలు, శిక్షణ కార్యక్రమాలు భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ మండలి అమలు చేస్తున్న ఇతర సంక్షేమ పథకాల గురించి కార్మికులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. అవగాహన సదస్సులో జిల్లాలోని భవన ఇతర నిర్మాణ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ రఫీ, చక్రధర్‌రెడ్డి, ‘బహుజన కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కన్నం లక్ష్మణ్ పాల్గొన్నారు.

నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న తెలంగాణ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ నాయకులు

సుభాష్‌నగర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కార్మికులకు నష్టం కలిగించే కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని తెలంగాణ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు చీకోటి శ్రీధర్ డిమాండ్ చేశారు. యూని యన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌ల వల్ల కార్మికులు, మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్‌కు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ఈ కొత్త లేబర్ కోడ్‌ల వల్ల యూనియన్ ఏర్పాటు చేసుకునే హక్కు ఉండదని, న్యాయమైన సమస్య పరిష్కారం కోసం సమ్మె చేసే హక్కు కూడా కాలరాసేలా ఉన్నాయని విమర్శించారు. ఈ నెల 24 నుంచి 26 వరకు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు విద్యాసాగర్, శ్రీనివాస్, సదానందచారి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర్లు, మిరుపాల అంజయ్య, ఉపాధ్యక్షుడు హరీష్, సహాయ కార్యదర్శులు నరేందర్, మదన్‌మోహనాచారి, సంపత్‌రెడ్డి పాల్గొన్నారు.

నిబంధనలకు నీళ్లు

- వాణిజ్య అవసరాలకు సెల్లార్లు
- దర్జాగా రోడ్లపైనే వాహనాల పార్కింగ్
- స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న బల్దియా అధికారులు
- రెండు రోజుల్లో 41 అపార్టుమెంట్లకు నోటీసులు జారీ



హాస్పిటల్ లైన్‌లో ఫుట్‌పాత్‌పై పార్క్ చేసిన వాహనాలు

కరీంనగర్ టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వాణిజ్యసముదాయాలు, కమర్షియల్ బిల్డింగ్స్‌లో నిబంధనలకు తిలోదకాలిస్తున్నారు. ఆయా వాణిజ్య సముదాయాలు, బిల్డింగ్స్‌కు సంబంధించిన వాహనాలను పార్కింగ్ చేసేందుకు వదిలిపెట్టాల్సిన సెల్లార్లను దర్జాగా ఇతర వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నారు. దీంతో వాహనాలను భవనాల ఎదుట రోడ్లపైనే పార్కింగ్ చేస్తున్నారు. చాలా చోట్ల ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. నిబంధనల మేరకు వాణిజ్య సముదాయాలు, కమర్షియల్ బిల్డింగ్స్, అపార్టుమెంట్లలో ఎప్పుడైనా అగ్ని ప్రమాదం లాంటివి సంభవిస్తే కనీసం ఫైర్ ఇంజన్ తిరిగే విధంగా నాలుగువైపులా ఖాళీ స్థలం ఉండాలి. అలాంటి నిబంధనలు చాలా భవనాల్లో పాటించడం లేదు.



సెల్లార్‌ను తనిఖీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ (ఫైల్)

- **రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ ఇబ్బందులు**

నగరంలో జనాభాతోపాటు వాహనాల సంఖ్య విపరీతంగా పెరుగుతోంది. మరోవైపు దర్జాగా రోడ్లను, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వాహనాలను దుకాణాలు, హాస్పిటల్, షాపింగ్ మాల్స్, ఫంక్షన్ హాల్స్, ప్రైవేట్ విద్యాసంస్థలు, పెద్దపెద్ద వ్యాపార, వాణిజ్య సంస్థలకు వచ్చే వారు రోడ్లపై వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. దీంతో నగరంలో విపరీతమైన ట్రాఫిక్ సమస్య ఏర్పడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ట్రాఫిక్ సమస్యను పరిష్కరిం చేందుకు పలు కార్యక్రమాలకు శ్రీకారం చుడుతు న్నారు. ఇప్పటికే రోడ్లపై, ఫుట్‌పాత్‌ల ఆక్రమణలను తొలగించడంతోపాటు తిరిగి వాటి ఆక్రమణలు జరుగకుండా ఉండేందుకు వెండింగ్ జోన్లను ఏర్పా టు చేశారు. ‘బెటర్ స్పేసెస్... బెటర్ కేఎంసీ’ కోసం నగరంలో నిరంతరంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని టౌన్‌ప్లానింగ్ అధికారులను ఇటీవల ఆదేశించారు. ప్రతి రోజు టౌన్‌ప్లానింగ్ అధికారులు నగరంలో పర్యటించి రోడ్లు, ఫుట్‌పాత్ ఆక్రమణలు, స్ట్రీట్ వెండింగ్ జోన్ నిర్వహణతోపాటు కమర్షియల్ బిల్డింగ్స్, వాణిజ్య సముదాయాల్లో సెల్యూలర్లలో కమర్షియల్ వినియోగంపై దృష్టిపెట్టాలని ఆదేశిం చారు. దీంతో రెండు రోజుల నుంచి టౌన్‌ప్లానింగ్ అధికారులు నగరంలో స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. వాణిజ్య సముదాయాలను సంద ర్శించి సెల్లార్లలో వాహనాలను పార్కింగ్ చేస్తున్నారా... లేక కమర్షియల్ అవసరాలకు (మిగతా 8వ పేజీలో)

ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి

సుభాష్‌నగర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్ట రేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్ర మంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కొన్ని దరఖాస్తులను అక్కడి కక్కడే పరిష్కరించారు. మొత్తం 352 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. కార్య క్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవో మహేశ్వర్ పాల్గొన్నారు.

- **నా భర్త ఆచూకీ తెలియజేయండి..**

\- చొక్కల అఖిల, గునుకుల కొండాపూర్



ఇద్దరు పిల్లలతో అఖిల

నా భర్త కుటుంబాన్ని పోషించడం కోసం 2022 జూలై 26న దుబాయికి వెళ్లాడు. 2023 అక్టోబరులో తాను ఇంటికి వస్తానని, అందుకు టికెట్‌కు కూడా డబ్బులు లేవని ఫోన్ చేశాడు. దీంతో ఇక్కడి నుంచే ఫ్లైట్ టికెట్ బుక్ చేసి పంపిం చాము. ఆనాటి నుంచి అతడి ఆచూకీ తెలియడం లేదు. మాకు ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. నా భర్త ఆచూకీ తెలుసుకుని నన్ను ఆదుకోవాలి.

టీసీసీ పరీక్ష ఫీజు చెల్లింపు గడువు డిసెంబరు 5

కరీంనగర్ టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలకు హాజరయ్యే వారు డిసెంబరు 5లోగా పరీక్షా ఫీజు చెల్లించాలాని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్ మొండయ్య ఒక ప్రకటనలో తెలిపారు. 50 రూపాయల అపరాధ రుసుముతో డిసెంబరు 12 వరకు, 75 రూపాయల అపరాధ రుసుముతో డిసెంబరు 19వ తేదీ వరకు పరీక్షా ఫీజు చెల్లించవచ్చన్నారు.

- **1 నుంచి డీఎల్ఈడీ పరీక్షలు**

జిల్లాలో డీఎల్ఈడీ ప్రథమ సంవత్సరం పరీక్షలు డిసెంబరు 1 నుంచి 6 వరకు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి మొండయ్య ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఏర్పాటు చేసిన రెండు పరీక్షా కేంద్రాల్లో ప్రతిరోజు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు పరీక్షలు ఉంటాయన్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు తమ హాల్ టికెట్లను bse.telangana.gov.in ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

పేదలకు మెరుగైన వైద్య సేవలందించాలి

- **కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్**



జమ్మికుంట ఆసుపత్రిలో వైద్య పరికరాలను ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్

హుజూరాబాద్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పేదలకు ప్రభుత్వాస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలందించాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. సోమవారం హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రిలో రూ.1.20కోట్లతో అధునాతనమైన పరికరాలను అందజేసి, వాటిని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ పేదలు, మధ్యతరగతి ప్రజలు మాత్రమే ప్రభుత్వాస్పత్రులకు వస్తున్నారని, ఆస్పత్రుల్లో కనీస సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆస్పత్రుల బలోపేతం కోసం నేషనల్ హెల్త్ మిషన్ పేరుతో పెద్దఎత్తున నిధులు ఇస్తున్నప్పటికి వాటిని రాష్ట్ర ప్రభుత్వం సరిగా వాడుకోవడం విఫలమవుతోందన్నారు. ప్రజలెవరైనా విద్య, వైద్యం ప్రభుత్వం నుంచి అందాలని భావిస్తారన్నారు. ప్రభుత్వాస్పత్రులకు వచ్చే పేదలకు మెరుగైన వైద్యం అందాలనే ఉద్దేశంతో 1.2 కోట్లతో అధునాతనమైన పరికరాలను ఆస్పత్రికి అందజేశామన్నారు. వైద్యులు వాటిని ఉపయోగించి పేదలకు మరింత వైద్య సేవలందించాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ పమేలా సత్పతి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, ఆర్డీవో రమేష్‌బాబు, డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ, డిప్యూటీ డీఎంహెచ్‌వో చందు, ఆస్పత్రి సూపరింటెండెంట్ నారాయణరెడ్డి, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, వైద్యులు కృష్ణప్రసాద్, శ్రీకాంత్‌రెడ్డి, సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.



హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రిలో నూతన పరికరాలను పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్

- **వైద్య పరికరాలను ఉపయోగించాలి..**

జమ్మికుంట: ప్రభుత్వ ఆసుపత్రులకు తాను అందజేస్తున్న వైద్య పరికరాలను ఉపయోగించి ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ వైద్యులకు సూచించారు. జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రిని ఆయన సందర్శించారు. ఆయన ఇటీవల కోటి రూపాయాల విలువైన వైద్య పరికరాలను జమ్మికుంట ఆసుపత్రికి అందజేశారు. వాటిని ఆయ న ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ తన జన్మదినం సందర్భంగా జమ్మికుంట, హుజూరాబాద్, వేముల వాడ, హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రులకు నాలుగు కోట్ల విలువైన వైద్య పరికరాలను ఎస్ఎండీసీ సంస్థ సహాయంతో కొనుగోలు చేసి అందించినట్లు తెలిపారు. జమ్మికుంట ప్రభుత్వ ఆసు పత్రిలో అన్ని వైద్య సౌక ర్యాలు అందుబా టులోకి వచ్చాయన్నారు. త్వరలోనే ఎంపీ ల్యా డ్స్ నుంచి ఎక్స్‌రే మిషన్ అందజేస్తామ న్నారు. వైద్య పరికరాలు రోగుల కోసం వినియోగించకుంటే వాటిని వాపస్ తీసుకుంటామని హెచ్చరిం చారు. కరీంనగర్, వేములవాడ ఆసుపత్రులకు ఐసీయూ అంబులెన్స్‌లు ఇస్తే వాడుకోలేదని, వాటిని వేరే ఆసుపత్రులకు పంపించామ న్నారు. రైతుల కోసం కాకుండా కమీషన్ల కోసం చెక్‌డ్యామ్‌లను నిర్మిస్తున్నారని విమర్శించారు. గతంలోనూ పలు చెక్‌డ్యామ్‌లు కూలిపోయా యని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే చెక్‌డ్యామ్‌లు కూలిపోవడంపై విచారణ జరపాలన్నారు. బాధ్యులైన కాంట్రా క్టర్ల ఆస్తులను సీజ్ చేయాలన్నారు. అ (మిగతా 8వ పేజీలో)

మానేరు చెక్ డ్యామ్ ఘటనపై సమగ్ర విచారణ

- **కలెక్టర్ పమేలా సత్పతి, సీపీ గౌస్ ఆలం**
- **ఘటనా స్థలం పరిశీలన**

కరీంనగర్ క్రైం/జమ్మికుంట రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలం తనుగుల సమీపంలోని మానేరు వాగుపై నిర్మించిన చెక్ డ్యామ్ దెబ్బతిన్న ఘటనపై జిల్లా యంత్రాంగం, పోలీస్ శాఖ సీరియస్‌గా స్పందించింది. సోమవారం కలెక్టర్ పమేలా సత్పతి, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ఘటనా స్థలాన్ని సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. నవంబరు 21న రాత్రి సమయంలో ఈ చెక్ డ్యామ్ దెబ్బతిన్నది. ఈ ఘటన నీటి ప్రవాహానికి సహజంగా జరిగిందా? లేక ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా విధ్వంసానికి పాల్పడ్డారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో, జమ్మికుంట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



చెక్ డ్యామ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం

- **శాస్త్రీయ విచారణ- క్లూస్ టీం పరిశీలన..**

ఘటనా స్థల పరిశీలనలో భాగంగా అధికారులతో పాటు హైదరాబాద్ నుంచి వచ్చిన ఫోరెన్సిక్ ల్యాబ్ అసిస్టెంట్ డైరెక్టర్ వెంకట్ రాజ్ నేతృత్వంలోని బృందం కరీంనగర్ క్లూస్ టీం సభ్యులు, ఫింగర్ ప్రింట్ ఇన్‌స్పెక్టర్లు రాజు, స్వర్ణజ్యోతి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ఈ ఘటనకు కారణాలను వెలికితీయడానికి పూర్తిస్థాయి విచారణ జరుపుతున్నామన్నారు. సాంకేతిక నిపుణుల సహకారంతో అక్కడి నుంచి నమూనాలు సేకరించామని తెలిపారు. ఎవరైనా బాధ్యులని తేలితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో హుజురాబాద్ ఏసీపీ మాధవి, పెద్దపల్లి ఏసీపీ కృష్ణ, ఇన్‌స్పెక్టర్లు రామకృష్ణగౌడ్, లక్ష్మీనారాయణ, ఎస్ఐలు శేఖర్‌రెడ్డి, ఆవుల తిరుపతి పాల్గొన్నారు.

ఇందిరమ్మ లబ్ధిదారులకు
రుణ సౌకర్యం
- స్వయం సహాయక సంఘాల ద్వారా రూ. రెండులక్షల వరకు..
- సంఘంలో తీర్మానం తప్పనిసరి

7

విద్యా విప్లవానికి నాంది..
యంగ్ ఇండియా స్కూల్

చొప్పదండి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యా విప్లవానికి నాందిగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిలుస్తుందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మండలంలోని రుక్మాపూర్‌లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు సోమవారం శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ఈ ఆధునిక విద్యా సంస్థను 200 కోట్ల వ్యయంతో అంతర్జాతీయ ప్రమాణాల సదుపాయాలతో నిర్మించనున్నామన్నారు. ఈ పాఠశాలతో గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్య అందుబాటులోకి వస్తుం దని తెలిపారు. చొప్పదండి నియోజక వర్గాన్ని విద్యా హబ్‌గా అభివృద్ధి చేయడమే తన లక్ష్య మన్నారు. స్కూల్‌ను మం జూరు చేసినందుకు సీఎం రేవంత్ రెడ్డికి ఆయన కృత జ్ఞతలు తెలిపారు. కార్యక్రమం లో అదనపు కలెక్టర్ అశ్విని తా నాజీ వాఖడే, డీఈవో శ్రీరామ్ మొండయ్య పాల్గొన్నారు.

- ఇందిరా మహిళాశక్తి కార్యక్రమంలో భాగంగా చొప్ప దండిలో ఇందిరమ్మ చీరలను స్వయం సహాయక సంఘ సభ్య మహిళలకు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పంపిణీ చేశారు.



రుక్మాపూర్‌లో స్కూల్‌కు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

ద్విచక్రవాహనం అదుపుతప్పి యువకుడి మృతి

● పెళ్లయిన రెండు నెలలకే ఘటన



ప్రవీణ్(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేట గ్రామశివారులోని మూలమలుపు వద్ద ఆదివారం అర్ధరాత్రి ద్విచక్రవాహనం అదుపుతప్పి అదే గ్రామానికి చెందిన శివరాత్రి ప్రవీణ్(25) అక్కడికక్కడే మృతిచెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన ప్రవీణ్ కూలి పనులు చేస్తూ జీవిస్తుండేవాడు. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన యువతి స్వాతిని రెండునెలల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ఈ నెల 23న ప్రవీణ్ తన కుటుంబీకులతో కలిసి మండలంలోని పదిరలో సమీప బంధువుల వివాహానికి వెళ్లాడు. అదేరోజు రాత్రి ప్రవీణ్ బంధువుకు చెందిన బైక్ తీసుకుని రాజన్నపేటలోని స్నేహితుడి భరత్ వేడుకలకు హాజరయ్యాడు. తిరుగు ప్రయాణంలో రాజన్నపేట గ్రామశివారులో ద్విచక్రవాహనం అదుపు తప్పి పక్కన ఉన్న చెట్టపొదల్లోకి దూసుకెళ్లి మృతిచెందాడు. సోమవారం ఉదయం రహదారి వెంట వెళుతున్న పలువురు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతిచెందిన వ్యక్తి గ్రామంలోని అనిల్‌గా గుర్తించారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు అక్కడకు చేరుకున్నారు. వివాహమైన రెండు నెలలకే అనిల్ మృతిచెందడంతో భార్య స్వాతి రోదించిన తీరు అక్కడున్న వారిని కలిచి వేసింది. మృతుడికి భార్య స్వాతి, తల్లిదండ్రులు భాగ్య, మైసయ్య ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు తెలిపారు.

కొనుగోలు కేంద్రంలో గుండెపోటుతో రైతు మృతి



సత్యనారాయణ(ఫైల్)

జమ్మికుంట రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం గండ్రపల్లికి చెందిన గండ్ర సత్యనారాయణ(54) అనే రైతు గ్రామంలోని ఐకేపీ కొనుగోలు కేంద్రంలో సోమవారం గుండె పోటుతో మృతిచెందాడు. గ్రామస్థుల వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన సత్యనారాయణ తనకు ఉన్న నాలుగు ఎకరాల వ్యవసాయ భూమిలో వరి సాగు చేశాడు. నాలుగు రోజుల క్రితం గ్రామంలోని ఐకేపీ కొనుగోలు కేంద్రానికి ధాన్యం అమ్మేందుకు తెచ్చాడు. కేంద్రం నిర్వాహకులు ధాన్యం ఎంపిక చేసి సంచులు ఇచ్చారు. కొన్ని గంటల్లో ధాన్యం అమ్ముకొని ఇంటికి వెళ్దామనుకునే లోపు ఒక్కసారిగా గుండె పోటు రావడంతో కుప్పకూలిపోయాడు. సత్యనారాయణకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ రామకృష్ణగౌడ్ తెలిపారు.

వ్యవసాయ బావిలో పడి ఒకరి మృతి



నారాయణ(ఫైల్)

తిమ్మాపూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేణికుంటలో కనుకుంట నారాయణ(60) వ్యవసాయ బావిలో పడి మృతి చెందాడు. పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. కనుకుంట నారాయణకు భార్య, ముగ్గురు సతానం. ఆదివారం రాత్రి ఇంట్లో నిద్రించాడు. ఇంట్లో వాళ్లు ఉదయం లేచి చూసేసరికి గదిలోలేకపోవడంతో పొలం వద్దకు వెళ్లినట్టు భావించారు. సోమవారం ఉదయం 9గంటలైనా ఇంటికి రాకపోవడంతో గ్రామంలో వెతికారు. గ్రామానికి చెందిన మంగలి లచ్చయ్య తనకు రాత్రి 10గంటలకు నారాయణ పొలం వద్దకు వెళ్తున్నట్లు కలిసి చెప్పాడని తెలిపాడు. దీంతో పొలం వద్ద వెతుకుతుండగా పెసరి చంద్రయ్య అనేవ్యక్తి వ్యవసాయ బావిలో నారాయణ మృతిచెంది కనిపించాడు. ఎల్ఎండీ పోలీసులు నారాయణ మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలిం చారు. తనతండ్రి నారాయణకు కళ్లు సరిగా కనిపించక ప్రమాద వశాత్తు కాలుజారి బావిలో పడిపోయినట్లు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సదన్ కుమార్ తెలిపారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి వృద్ధుడి మృతి

వీణవంక, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్లూరు గ్రామానికి చెందిన రామిడి మల్లారెడ్డి(74) అనే వృద్ధుడు ప్రమాదవశాత్తు మల్లరికుంట చెరువులోపడి మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. మల్లారెడ్డి గేదెలు మేపేందుకు వెళ్లి రాత్రి ఇంటికి రాలేదు దీంతోగ్రామంలో వెతకగా ప్రమాదవశాత్తు మల్లరికుంట చెరువులోపడి మృతిచెందినట్టు గుర్తించారు. మల్లారెడ్డి భార్య రామిడి లక్ష్మి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

హైదరాబాద్‌లో బుజునూర్ వాసి మృతి



వెంకటరెడ్డి(ఫైల్)

ఇల్లందకుంట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుజునూర్ గ్రామానికి చెందిన కటంగూరి వెంకటరెడ్డి(60) హైదరా బాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో సోమవారం మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కటంగూరి వెంకటరెడ్డి, లత దంపతులకు ఇద్దరు కూమార్తెలున్నారు. ఒకరు బెంగుళూరులో, మరొకరు హైదరాబాద్‌లో ఉంటున్నారు. ఇటీవల హైద్రాబాద్‌లో ఉంటున్న కూతురు ఇంటికి వెంకటరెడ్డి, లత దంపతులు వెళ్లారు. తిరిగి ఇంటికి వచ్చేందుకు సోమవారం ఉదయం బయలుదేరారు. రోడ్డు దాటుతున్న సమయంలో ఇద్దరినీ ఓ వ్యాన్ వేగంగా ఢీకొంది. తీవ్రంగా గాయపడ్డ వెంకటరెడ్డి అక్కడికక్కడే మృతిచెందగా లతకు తీవ్ర గాయాలయ్యాయి.

బావిలో దూకి యువకుడి ఆత్మహత్య

జ్యోతినగర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కాజిపల్లిలో బైరి రాజేష్(30) అనే యువకుడు సోమవారం బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మల్యాలపల్లికి చెందిన రాజేష్ రాజుపల్లికి చెందిన యువతితో ఐదేళ్ళ క్రితం వివాహం జరిగింది. అతను భార్యతో కలిసి సమీపంలోని మాతంగి కాలనీలో నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో రాజుపల్లిలోని అత్తగారి ఇంటి బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా మల్లన్న దేవాలయం ధ్వజస్థంభం ప్రతిష్ఠాపన



ధ్వజ స్థంభం ప్రతిష్ఠాపనలో పాల్గొన్న గ్రామస్థులు

ఇబ్రహీంపట్నం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మల్లన్న దేవాలయంలో సోమవారం నూతన ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమాన్ని వేదపండితులు, గ్రామస్థులు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మల్లన్న స్వామికి ప్రత్యేకపూజలు చేయగా, భక్తులు మంగళహారతులతో మల్లన్నను కీర్తించారు. వేదపండితులు మంత్రోచ్చారణల మధ్య ధ్వజస్తంభం ప్రతిష్ఠించారు. ఈవేడుకల్లో దేవాలయ కమిటీసభ్యులు, భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆహార ఉత్పత్తి అభివృద్ధే లక్ష్యం

● నిరుద్యోగ యువత, సంఘాలకు వరం..
పీఎంఎఫ్ఎంఈ పథకం
● పరిశ్రమల ఏర్పాటుకు సబ్సిడీ రుణం



ఆహార ఉత్పత్తి, తయారీ రంగాల్లో నాణ్యత ప్రమాణాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా పీఎంఎఫ్ఎంఈ పథకాన్ని నిర్వహిస్తున్నాయి. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను స్థాపించే యువత, స్వశక్తి సంఘాలకు 30 లక్షల రూపాయల వరకు రుణాలను అందజేసి 35 శాతం వరకు సబ్సిడీని అందజేసే ఈ పథకాన్ని ఎంవోఎఫ్‌పీఐ (మినిస్ట్రీ ఆఫ్ ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీస్) రూపొందించింది. ఫుడ్ ప్రాసెసింగ్ యూ నిట్లను బలోపేతం చేస్తూ ఉత్పత్తులను మార్కెటింగ్, మౌలిక సదుపాయాలను ఈ పథకం కల్పిస్తుంది. పరిశ్రమల సామర్థ్యం, అభివృద్ధికి కావాల్సిన సాంకేతికతను అందజేస్తుంది. బ్యాంకుల ద్వారా రుణాలను అందజేస్తూ యూనిట్ల స్థాపనకు కృషి చేస్తుంది.

\- చొప్పదండి, (ఆంధ్రజ్యోతి)

● 30 లక్షల వరకు రుణ సదుపాయం...

పీఎంఎఫ్ఎంఈ పథకం కింద ఆహార ఉత్పత్తుల(ఫుడ్ ప్రాసెసింగ్) యూనిట్ల స్థాపనకు వ్యక్తులు, స్వయం సహాయక గ్రూపులు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. యూనిట్లకు లక్ష రూపాయల నుంచి 30 లక్షల వరకు బ్యాంకులు రుణాన్ని అందజేస్తాయి. 35 శాతం సబ్సిడీని 10 లక్షలకు మించకుండా అందజేస్తారు. పెద్ద పరిశ్రమకు 10 కోట్ల రూపాయల వరకు రుణాన్ని మూడు కోట్ల వరకు సబ్సిడీని అందజేస్తారు. ఎఫ్‌పీవోలు, ఎస్‌హెచ్‌జీలు, సహకార సంఘాలు, ప్రభుత్వ ఏజెన్సీలు, పెద్ద పరిశ్రమలు పెట్టేందుకు అర్హులు కాగా, పరిశ్రమల పెట్టుబడిలో 10 శాతం వాటాను చెల్లించాల్సి ఉంటుంది.



పీఎంఎఫ్ఎంఈ బ్రోచర్

● యూనిట్‌కు రుణ సదుపాయం...

బేకరీకి 10 లక్షలు, హోం ఫుడ్స్, పచ్చళ్లు, పాపడ్ తయారీకి 5 లక్షలు, రైస్ మిల్ ఏర్పాటుకు 50 లక్షల రుపాయలు అందజేస్తారు. మొబైల్ రైస్ మిల్‌కు 10 లక్షలు, గానుగ నూనె యూనిట్‌కు 8 లక్షల నుంచి 10 లక్షలు, మసాల ప్యాకింగ్ యూనిట్‌కు 4 లక్షల నుంచి 6 లక్షలు ఇస్తారు. దాల్ మిల్స్‌కు 10 లక్షల నుంచి 15 లక్షలు, స్వీట్ హౌస్ ఏర్పాటుకు 3 లక్షలు, పల్లిపట్టి యూనిట్‌కు 10 లక్షల నుంచి 20 లక్షలు, ఇన్‌స్టంట్ ఫుడ్స్ తయారీకి 10 లక్షల నుంచి 20 లక్షలు, ఫ్లోర్ మిల్లుల ఏర్పాటుకు 2 లక్షల నుంచి 5 లక్షల వరకు రుణాలు అందజేస్తారు. దరఖాస్తులను pmfme.mofpi.gov.in వెబ్‌సైట్‌లో దాఖలు చేయాలి.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు విద్యార్థిని ఎంపిక



సాత్విక

సుల్తానాబాద్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నందిమేడారంలో ఈనెల 26న జరిగే రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు గర్రెపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని సాత్విక ఎంపికైంది. గర్రెపల్లి ప్రభుత్వ పాఠశాలలో 9వతరగతి చదువుతున్న సాత్విక జిల్లాస్థాయి పోటీల్లో చక్కని ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయులు ఆసియా తెలిపారు. సాత్వికను ప్రధానోపాధ్యాయులు కవిత, ఉపాధ్యాయబృందం అభినందించారు.

గంజాయి పట్టివేత

బుగ్గారం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): బుగ్గారం మండలం గోపులాపూర్ గ్రామంలో సోమవారం పల్లెప్రకృతి వనం వద్ద గంజాయి తాగుతున్న ఇద్దరు యువకులను ఎస్సై సతీష్ పట్టుకున్నారు. గంజాయి తాగుతున్న బీహార్ రాష్ట్రానికి చెందిన కగారియా జిల్లాకు చెందిన సురాజ్‌కుమార్, రాహుల్‌కుమార్ వద్ద నుంచి 60గ్రాముల గంజాయి స్వాధీనంచేసుకొని కేసు నమోదు చేసినట్లు సతీష్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గంజాయి తాగినా, అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎస్టీ గురుకుల కళాశాల కార్యాలయానికి తాళం

● 8నెలలుగా అద్దె ఇవ్వడం లేని యజమాని ఆవేదన

మంథని, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ గిరిజనబాలికల జూనియర్ కళాశాల అద్దె భవనంలోని ఆఫీసు రూంకు భవన యజమాని మురళీధర్‌రెడ్డి సోమవారం తాళం వేశారు. తనకు 8 నెలలుగా అద్దె చెల్లించకుండా, ఖాళీ చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆయన ఆరోపించారు. అద్దె విషయంలో అధికారులకు ఎన్నిసార్లు చెప్పిన నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో చివరకు తాళం వేయాల్సి వచ్చింది వాపోయారు. ఈ విషయం తెలుసుకున్న ప్రజా సంఘాల నేతలు బూడిద గణేష్, మంథని లింగన్న, బాబు, రవిలు అక్కడి చేరుకొని భవన యజమానితో చర్చించారు. భవనానికి తాళం వేయడం ద్వారా విద్యార్థుల విద్యకు, భోజన, వసతికి ఇబ్బందులు ఏర్పడుతాయని సూచించడంతో యజమాని శాంతించారు. ప్రజా సంఘాల నేతలు ఈ విషయాన్ని ఆర్డీవో, తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్ళడంతో డీటీ, ఆర్ఐలు అక్కడికి చేరుకొని జరిగిన ఇబ్బందిని రికార్డు చేసుకున్నారు. అనంతరం ఆర్డీవో సురేష్ యజమానికి మురళీధర్‌రెడ్డిని పిలిపించుకొని అద్దె చెల్లింపు విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. దీంతో ఆయన ఆఫీసు రూంకు వేసిన తాళం తీశారు.

మైనార్టీ గురుకుల పాఠశాల ఎదుట..

విద్యార్థుల ఆందోళన

● కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్



జగిత్యాలలో మైనార్టీ పాఠశాల ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కనీస వసతులు కల్పించాలని జగిత్యాలలోని ఖిలాగడ్డ మైనార్టీ పాఠశాల ఎదుట విద్యార్థులు సోమవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ తమ పాఠశాలలో ల్యాబ్, లైబ్రరీ సదుపాయం లేదని, గ్రౌండ్ కూడా లేకపోవడంతో పాటు ఇతర సమ స్యలతో తాము ఇబ్బందులు పడుతు న్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రవి వైఖరి తమకు ఆవేదన కలిగించిందని ఆయనపై ఉన్నతాధి కారులు చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈవిషయమై ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రవిని వివరణ కోరగా మందలించే క్రమంలో ఇబ్బంది జరిగిందని భావిస్తున్నామని, మరోమారు ఇలాంటివి జరగకుండా చూసుకుంటామని ఆయన వెల్లడించారు. అనంతరం మైనార్టీ నాయకులు, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులను సముదాయించడంతో వారు ఆందోళన విరమించారు.

హత్య కేసులో నిందితుడి రిమాండ్



నిందితుడిని అరెస్టు చూపుతున్న రూరల్ సీఐ ఏ నిరంజన్‌రెడ్డి

కరీంనగర్ క్రైం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మొగ్దుంపూర్ శివారులోని ఇటుక బట్టీల్లో ఇటీవల ఒడిస్సాకు చెందిన కార్మికుడు సూరజ్‌కుంభార్(45) అనుమానాస్పదస్థితిలో మృతిచెందగా పోలీసులు సోమవారం నిందితుడిని పట్టుకుని రిమాండ్ చేశారు. కరీంనగర్ రూరల్‌సీఐ నిరంజన్‌రెడ్డి సోమవారం ఈ కేసుకు సంబంధించిన వివరాలను విలేకరులకు వెల్లడించారు. ఒడిస్సా జర్సుగూడ జిల్లాకు చెందిన సూరజ్ కుంభార్ కొన్నిరోజుల కిందట దుర్గగార్డియా మరికొందరితో కలిసి మొగ్దుంపూర్ ఇటుకబట్టీల్లో పని చేసేందుకు వచ్చాడు. దుర్గగార్డియా అదే ఇటుక బట్టీలో పనిచేస్తున్న ఒక మహిళతో చనువుగా ఉండడాన్ని సూరజ్‌కుంభార్ గమనించాడు. సూరజ్ కుంభార్ గమనిస్తున్నాడని తెలుసుకున్న దుర్గ గార్డియా అతడిపై కోపం పెంచుకున్నాడు. దుర్గగార్డియా నవంబరు 8న అర్ధరాత్రి సూరజ్‌కుంభార్ ఉన్న గదిలోకి వెళ్లి సూరజ్‌ను ఛాతి, కడుపు, పొత్తికడుపులో బలంగా తన్నడంతో స్పృహ తప్పి పడిపోగా అక్కడే వదిలేసి వెళ్లిపోయాడు. మరుసటిరోజు మిగతా వారితో కలిసి వచ్చి చూశాడు. కార్మికులు వెంటనే ఇటుకబట్టీల యజమానికి సమాచారం ఇవ్వగా ఆయన 108అంబులెన్స్‌కు ఫోన్ చేశాడు. సూరజ్ కుంభార్‌ను చూసి అప్పటికే చనిపోయాడని 108 సిబ్బంది తెలిపారు. సూరజ్ కుంభార్ మద్యం తాగి ఆహారం తీసు కోనందున సహజంగా చనిపోయినట్లు ఉన్నాడని తోటికార్మికులతో దుర్గ గార్డియా చెప్పి యజమాని తెప్పించిన అంబులెన్స్‌లో మృతదేహాన్ని ఒడిసాకు తీసుకెళ్లారు. అక్కడికి వెళ్లిన తర్వాత కుటుంబసభ్యులు సూరజ్ సహజంగా చని పోలేదని, ఎవరో చంపి ఉంటారని అక్కడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అక్కడి పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం చేయించగా సూరజ్ శరీరం లోపలిభాగంలో బలమైన గాయాలు తగిలి చనిపోయినట్లు వెల్లడైంది. వెంటనే కేసు నమోదుచేసి కరీంనగర్‌కు ట్రాన్స్‌ఫర్ చేశారు. కరీంనగర్‌రూరల్ పోలీసులు ఇక్కడ కేసు నమోదుచేసి విచారణ జరుపగా దుర్గా గార్డియనే హత్య చేశాడని వెల్లడైంది. దుర్గా గార్డియాను సోమవారం బొమ్మకల్ గ్రామంలోని గుంటూరుపల్లి వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారించగా తాను కొట్టిన దెబ్బలతో సూరజ్ చనిపోయినట్లు దుర్గా గార్డియా నేరం ఒప్పుకున్నాడు. సమావేశంలో ఎస్ఐ నరేష్, అంజద్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

మెట్‌పల్లి రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడుట్రాక్టర్లను పట్టుకున్నట్లు తహసీల్దార్ నీత తెలిపారు. కథలపూర్ మండలంనుంచి రాత్రివేళల్లో ఇసుకను తరలిస్తూ మండలంలోని రామలచ్చక్కపేట గ్రామశివారులో అక్రమంగా నిల్వచేసి ఉదయం ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తున్నారని సమాచారం రావడంతో సోమవారం రెవెన్యూ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈతనిఖీల్లో రామలచ్చక్కపేట, మెట్లచిట్టాపూర్ గ్రామాలమధ్య కోతకు గురైన వరదకాలువ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తుండగా వెల్లుల్ల గ్రామశివారులో మూడుట్రాక్టర్లను పట్టుకుని మెట్‌పల్లి తహసీల్దార్ కార్యాలయానికి తరలించినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ నీత మాట్లాడుతూ నిబంధ నలు అతిక్రమించి అక్రమంగా ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.

ఇబ్రహీంపట్నం: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు తహసీల్దార్ వరప్రసాద్ తెలిపారు. మల్లాపూర్ మండలం వాల్గొండ గ్రామంనుంచి మండలంలోని యామపూర్ గ్రామానికి ఇసుకను అనుమతులు లేకుండా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నామన్నారు. మరో ట్రాక్టర్‌ను నిజా మాబాద్ జిల్లా భట్టాపూర్ నుంచి మండలంలోని కోమటి కొండాపూర్‌గ్రామానికి తరలిస్తుండగా పట్టుకున్నట్లు తహసీల్దార్ పేర్కొన్నారు. ఒక్కొక్కరికి రూ.10వేలజరిమానా విధించినట్లు తెలిపారు.

బంగారం చోరీ

వీణవంక, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనపర్తి గ్రామానికి చెందిన కొయ్యడ మధునమ్మ ఇంట్లో పావు తులం బంగారం దొంగలు ఎత్తుకెళ్లారు. పోలీసులు వివరాల ప్రకారం.. మధునమ్మ కూలి పనులకు వెళ్లి వచ్చేసరికి ఇంటి తాళం పగలగొట్టి ఉంది. బీరువాలోని వస్తువులు చిందర వందరగా పడేశారు. బియ్యం డబ్బాలో దాచుకున్న పావుతులం బంగారం దొంగలు ఎత్తుకెళ్లారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తిరుపతి తెలిపారు.

గవర్నర్‌కు ఎస్‌యూ వైస్ చాన్సలర్ కృతజ్ఞతలు



గవర్నర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న ఎస్‌యూ వీసీ యు.ఉమేష్‌కుమార్

గణేశ్‌నగర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): గవర్నర్, విశ్వవిద్యాలయ కులపతి జిష్ణుదేవ్ వర్మకు శాతవాహన విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ ఉమేష్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. ఎస్‌యూ రెండో స్నాతకోత్సవానికి హాజరైన సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లో కలిసి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ స్నాతకోత్సవ ఏర్పాట్లు అద్వితీయంగా ఉన్నాయని కితాబిచ్చారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

తంగళ్లపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండల కేంద్రంలో ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొట్టడంతో ఇద్దరు తీవ్రంగా గాయ పడ్డారు. మండలకేంద్రానికి చెందిన రఘునందన్, పర్శరాములు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా కారుఢీకొట్టింది. దీంతో ద్విచక్ర వాహనంపై ఉన్న ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు వెంటనే వారిని 108 వాహనంలో జిల్లా కేంద్రంలోని ప్రధాన ఆసుపత్రికి తరలించారు.

పారితోషికం అందేదెన్నడో..?

● కుటుంబ సర్వే డేటా ఎంట్రీ ఎన్యూమరేటర్ల ఎదురుచూపులు ● ఏడాదైనా అందని భత్యం



కుటుంబ సర్వే డాటా ఎంట్రీ చేస్తున్న ఆపరేటర్లు(ఫైల్)

మల్యాల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం గతేడాది నవంబరులో చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ మరియు కుల సర్వే డేటా ఎంట్రీ చేసిన ఎన్యూమరేటర్లకు ఏడాదిగా తమకు చెల్లించాల్సిన బకాయిల కోసం ఎదురు చూస్తున్నారు. మల్యాల మండల వ్యాప్తంగా అధికారులు చేసిన ఇంటింట కుటుంబ సర్వే డేటాను 122మంది ఎన్యూమరేటర్లు ఇరవై వేలకు పైగా సర్వే వివరాలు ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయాలు, నాచుపల్లి జేఎన్‌టీయూ కళాశాలలో అక్కడి విద్యార్థులు మండలంలోని పలువురు యువతీయువకులు వివరాలు నమోదు చేశారు. అయితే వారికి ఎంట్రీ పూర్తి కాగానే చెల్లించాల్సిన పారితోషికను చెల్లించకపోవడంతో ఏడాది కాలంగా జిల్లా ఉన్నతాధికారులకు, ప్రజావాణిలో తమ విన్నపాలు వినిపిస్తూనే ఉన్నారు. అయితే వారి విన్నపాలు పట్టించుకోవడం లేదు.

● ఒక్కో ఎంట్రీకి రూ.30

సమగ్ర కుటుంబ సర్వేకు సంబంధించి ఒక్కో ఎంట్రీకి రూ.30 చెల్లించనున్నట్లు అధికారులు పేర్కొనడంతో పదుల సంఖ్యలో ఎన్యూమరేటర్లు ముందుకు వచ్చి డాటా ఆన్‌లైన్ చేశారు. మల్యాల మండలమే కాకుండా ఇతర మండలాలకు చెందిన వాటి సర్వే వివరాలను నమోదు చేయగా ఒక్కొక్కరికి కనీసం రూ.పది వేల నుంచి ఇరవై వేలకు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది. వెంటనే తమకు డబ్బులు చెల్లించాలని ఎన్యుమరేటర్లు కోరుతున్నారు.

● త్వరగా చెల్లించాలి

\- రుత్త గంగాధర్, ఎన్యూమరేటరు, మల్యాల

గత ఏడాది నవంబరు 30 నాటికి తాము డాటా ఎంట్రీ పూర్తి చేయగా అప్పటి నుంచి తమకు చెల్లిస్తామన్న డబ్బులు రాలేదు. అధికారుల దృష్టికి తీసుకెళ్లిన్నప్పటికీ వారి నుంచి ఎలాంటి స్పందన లేదు. ఇప్పటికైన తమకు ఎంట్రీకి సంబంధించిన సొమ్ములు వెంటనే చెల్లించాలి.

మత్స్యకార రాష్ట్ర మహాసభలను

విజయవంతం చేయండి

సుభాష్‌నగర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మత్స్యకారులు, మత్స్యకార్మికుల సంఘం 4వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సంఘం నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్ ఆవరణలో విలేకరులతో మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని రెవెన్యూ గార్డెన్‌లో ఈ నెల 25 నుంచి 27 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేరళ ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ స్టాన్లీ, రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి వాకాటి శ్రీధర్, రవాణా బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆహ్వానించినట్లు చెప్పారు. రాష్ట్రంలో మత్స్యవృత్తిపై ఆధారపడి సుమారు 10 లక్షల కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయని, 5,650 మత్స్య సహకార సంఘాల్లో 5 లక్షల 40 వేల మంది సభ్యులుగా ఉన్నారని అన్నారు. రాష్ట్రంలో కృష్ణ, గోదావరి నదులతోపాటు అనేక ఉప నదులు, 42 వేల చెరువులు, కుంటలు, 62 రిజర్వాయర్లు, సుమారు 7 లక్షల హెక్టార్లలో విస్తారమైన జలవనరులు ఉన్నాయన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత భూముల ధరలు విపరీతంగా పెరిగాయని, రియల్ ఎస్టేట్ మాఫియా, అధికార, ప్రతిపక్ష రాజకీయ దళారీలు పెద్ద ఎత్తున చెరువులు, కుంటలను కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రానున్న బడ్జెట్‌లో మత్స్య వృత్తి రక్షణ-మత్స్యకారుల సంక్షేమానికి రూ. 5,000 కోట్లు కేటాయించాలని, మత్స్యకారుల భద్రతకు ఇన్సూరెన్స్, ఎక్స్‌గ్రేషియాను రూ.20లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఉమ్మడి రాష్ట్ర మాజీ చైర్మన్ చేతి ధర్మయ్య, సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి లెల్లెల బాలకృష్ణ, జిల్లా అధ్యక్షుడు పిట్టల వెంకటేష్, ప్రధానకార్యదర్శి గణేశ్, కోశాధికారి పప్పు సదానందం, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ప్రమాదంలో మహిళకు గాయాలు

ధర్మారం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పొలం పనికి వెళ్లిన మహిళ నిలువ నీడ కోసం ట్రాక్టర్ క్రింద కూర్చోగా, గమనించని డ్రైవర్ ట్రాక్టర్ తీయడంతో మహిళకు గాయలయ్యాయి. మండలంలోని మల్లాపూర్ గ్రామానికి చెందిన దీకొండ సుగుణ వారి వ్యవసాయ పనుల నిమిత్తం పొలం వద్దకు వచ్చింది. ఎండ తీవ్రత ఎక్కువ ఉండడంతో కాసేపు సేదతీరడం కోసం పొలంలోని ట్రాక్టర్ ట్రాలీకింద కూర్చుంది. మహిళను గమనించని డ్రైవర్ ట్రాక్టర్ తీయగా సుగుణ కాలు విరిగింది. సమా చారం అందుకున్న 108సిబ్బంది చికిత్స నిమిత్తం ఆమెను కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.

ఇందిరమ్మ లబ్ధిదారులకు

రుణ సౌకర్యం

- స్వయం సహాయక సంఘాల ద్వారా రూ. రెండులక్షల వరకు..
- సంఘంలో తీర్మానం తప్పనిసరి



కరీంనగర్ రూరల్ మండలంలో పునాది దశలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లు, బహదూర్‌ఖాన్ పేటలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లు

కరీంనగర్ రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకానికి ఎంపికైన లబ్ధిదారులకు నాలుగు విడతల్లో ఐదు లక్షల రూపాయలను ప్రభుత్వం అందజేస్తుంది. పునాది పూర్తయితేనే ప్రభుత్వం మొదటి విడత నిధులు మంజూరు చేస్తుంది. లబ్ధిదారుల్లో పేదలే అధికంగా ఉండడంతో ఇంటి నిర్మాణానికి డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి వారికి స్వయం సహాయక సంఘాల ద్వారా 50 వేల నుంచి రెండు లక్షల రూపాయల వరకు రుణం అందజేస్తున్నారు. దీంతో పేద, మధ్య తరగతి ప్రజలకు ఊరట కలుగుతోంది. కరీంనగర్ రూరల్ మండలంలో 14 గ్రామాల్లో 1,164 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా వివిధ కారణాల వల్ల 22 రద్దయ్యాయి. ప్రస్తుతం 1,142 ఇళ్లకు గాను 546 ఇళ్లకు ముగ్గులు పోశారు. పునాదుల వరకు 50 ఇళ్లు, రూఫ్ లెవల్ వరకు ఆరు ఇళ్లు పూర్తయ్యాయి. 37 ఇళ్లకు స్లాబ్ వేశారు. ఇందులో స్వయం సహాయక సంఘంలో సభ్యులైన 106 మంది లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణానికి 1.06 కోట్ల రూపాయల రుణం అందించారు. ఇల్లు మంజూరై, మహిళా సంఘంలో సభ్యులైన వారు మాత్రమే రుణానికి అర్హులు. అవసరమైన వారు మహిళా సంఘంలో తీర్మానం చేయించి సంబంధిత ఏపీఎం, సీసీలను కలిస్తే బ్యాంకుల ద్వారా రుణం అందించేలా చర్యలు తీసుకుంటారు.

● ఉపాధి హామీ తోడ్పాటు

ఇళ్ల నిర్మాణానికి సంబంధించి రుణాలే కాకుండా ఉపాధి హామి పథకం ద్వారా ప్రభుత్వం తోడ్పాటు అందిస్తోంది. లబ్ధిదారుల ఆర్థిక సమస్యలు, కూలీల కొరత తదితర ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఈ చర్యలు తీసుకుంటోంది. ఉపాధి హామి జాబ్ కార్డు ఉండి ఇందిరమ్మ ఇళ్ళ పథకంలో లబ్ధిదారులైన వారికి 90 రోజుల హాజరు వేస్తారు. ఈ పని దినాలకు సంబంధించిన 27 వేల రూపాయలను లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తారు. పునాది నిర్మాణం నుంచి స్లాబ్ పూర్తయ్యే వరకు 90 రోజుల పని దినాలు కల్పిస్తూ లబ్ధిదారులకు ప్రభుత్వం కొంత మేర ఆసరా కల్పిస్తుంది.

తక్కువ వడ్డీతో రుణాలు...

- రామ్మోహన్, ఐకేపీ ఏపీఎం

ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు స్వయం సహాయక సంఘాల ద్వారా రుణాలు ఇస్తున్నాము. సంఘంలో సభ్యురాలై ఉండి తీర్మానం చేసి పంపితే నిర్మాణానికి బ్యాంకుల ద్వారా తక్కువ వడ్డీతో రుణాలిస్తున్నాము. లబ్ధిదారులు ప్రతినెలా కిస్తీలను కట్టుకుంటే సరిపోతుంది.

సామాజిక కార్యకర్త

బక్క జడ్సన్‌ను విడుదల చేయాలి



ధర్నా చేస్తున్న రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు

గణేశ్‌నగర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సామాజిక కార్యకర్త బక్క జడ్సన్‌ని విడుదల చేయాలని రిటైర్డ్‌ఎంప్లాయిస్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ కోహెడ చంద్రమౌళి డిమాండ్ చేశారు. సోమవారం తెలంగాణ చౌక్‌లో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి నుంచి రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు చెల్లించాలని గవర్నర్ కార్యాలయంలో మూడుసార్లు మెమోరాండం ద్వారా విన్నవించినా స్పందించకపోవడంతో మరోసారి రాజ్‌భవన్‌కు జడ్సన్ వెళ్లారని, అనుమతించకుండా అరెస్టు చేయడం అన్యాయమని అన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకిశాల ప్రభాకర్‌రావు మాట్లాడుతూ 2024మార్చి నుంచి రిటైర్డ్ ఉద్యోగులకు ఉపాధ్యాయుల బకాయిలను చెల్లించని పక్షంలో డిసెంబర్ మొదటివారంలో ఆమరణ నిరాహారదీక్ష చేపడతామన్నారు. సమావేశంలో జిల్లాఉపాధ్యక్షుడు గద్ద జగదీశ్వరాచారి, కోశాధికారి కనపర్తి దివాకర్, బోరుపల్లి రవీందర్, పాలు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

రూ. 8060కే సీసీఐ పత్తి కొనుగోలు

చొప్పదండి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): బీపీ స్పెషల్ మోడ్ పత్తి ధర క్వింటాల్‌కు 8060 రూపాయలకే కొనుగోలు చేయనున్నట్లు సీసీఐ ప్రకటించిందని మార్కెట్ కార్యదర్శి రాజేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు విషయాన్ని గమనించాలని, పత్తి అమ్మకానికి స్లాట్ బుకింగ్ చేసుకోవాలని పేర్కొన్నారు.

అవినీతిరహిత సమాజం కోసం..

యువత రాజకీయాల్లోకి రావాలి

● రాష్ట్రీయ లోక్‌దళ్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్‌కుమార్



జగిత్యాలలో మాట్లాడుతున్న రాష్ట్రీయ లోక్‌దళ్ రాష్ట్ర అధ్యక్షుడు దిలీప్ కుమార్

జగిత్యాల అర్బన్, నవంబర్ 24 (ఆంధ్రజ్యోతి): అవినీతి రహిత సమాజం కోసం యువత రాజకీయాల్లోకి రావాలని రాష్ట్రీయ లోక్‌దళ్ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్ కుమార్ పిలుపునిచ్చారు. రాష్ట్రీయ లోక్‌దళ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సామాజిక చైతన్య రథయాత్రలో భాగంగా సోమవారం జగిత్యాలలో మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పాలించిన బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్‌పార్టీలు తెలంగాణకు ద్రోహం చేశాయని విమర్శించారు. ప్రత్యేకతెలంగాణ ఏర్పడితే రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని భావించిన లక్షలాదిమంది యువత తెలంగాణ ఉద్యమంలో పనిచేశారన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత యువత ఆశలు అడియాసలు అయ్యాయని విమర్శించారు. భౌగోళిక తెలంగాణ ఏర్పడిందే తప్ప సామాజిక తెలంగాణ ఏర్పడలేదన్నారు. విద్య, వైద్యం, ఉపాధివంటి కీలక వ్యవస్థలు పూర్తిగా దెబ్బతిన్నాయని ఆయన ఆరోపించారు. ఇప్పటికి కనీసం రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాల్సి ఉందని, 28లక్షల మంది యువతకు వృత్తి నైపుణ్య శిక్షణ పూర్తి చేయాల్సి ఉన్నప్పటికీ ఆ దిశగా కృషి చేయడంలో రాష్ట్రప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల ఐక్యత తోనే బహుజనులకు రాజకీయ అధికారం వస్తుందని ఆ దిశగా రాష్ట్రీయ లోక్‌దళ్ పార్టీ కృషి చేస్తుందన్నారు. యువతను రాజకీయాల్లోకి ఆహ్వానించడంతో పాటు వారికి ఉపాధి కల్పించే విషయంలో తమపార్టీ తెలంగాణలోని అన్ని జిల్లాలలో జాబ్ మేళాలను నిర్వహించి ఉద్యోగ, ఉపాధిఅవకాశాలు కల్పిస్తుందని తెలిపారు. వచ్చే స్థానికసంస్థల ఎన్నికల్లో తమపార్టీ ఆధ్వర్యంలో యువతకు ఎక్కువ సీట్లు కేటాయించి అన్ని విధాలా ప్రోత్సహిస్తామని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పూర్తిగా దెబ్బతిందని, చివరికి రిటైర్డ్ ఉద్యోగులకు అందాల్సిన ప్రయోజనాలను కూడా ప్రభుత్వం దారి మళ్లించడం అన్యాయమన్నారు. బీసీలకు 42శాతం చట్టబద్ధ రిజర్వేషన్ అమలు చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చకపోవడంతో ప్రజలు అధికార పార్టీపై తీవ్రఆగ్రహంతో ఉన్నారన్నారు.

రైతులకు ఇచ్చిన హామీలు విస్మరించడంతో వారు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలను చైతన్యం చేసి వారిని రాజకీయ అధికారానికి దగ్గర చేయడం కోసం తమ పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలో సామాజిక చైతన్య యాత్రలను నిర్వహిస్తున్నామని కపిలవాయి దిలీప్ కుమార్ తెలిపారు. సమావేశంలో ఆర్‌ఎల్‌డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రిషబ్ జైన్, హసన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాంసాగర్‌కు స్వల్పంగా ఇన్‌ఫ్లో

జగిత్యాల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి సోమవారం స్వల్పంగా నీరువస్తోంది. ఎగువ ప్రాంతంనుంచి ప్రాజెక్టులోకి 1,338 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నుంచి సరస్వతీ కాలువద్వారా 650 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం మిషన్ భగీరథ ద్వారా 231క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 457 క్యూసెక్కుల నీరు పోతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 80.501 టీఎంసీలు కాగా అంతేస్థాయి నీటిమట్టంతో ప్రాజెక్టు నిండుకుండలా ఉంది. ప్రాజెక్టులోకి ఈ యేడాది జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటి వరకు 947.821 టీఎంసీల నీరు వచ్చిచేరగా, ప్రాజెక్టు నుంచి 880.108 టీఎంసీల నీరును దిగువకు వదిలారు.

వేములవాడ, కొండగట్టుకు పోటెత్తిన భక్తులు

● వేములవాడకు 50వేలకు పైగా భక్తుల రాక ● ఎల్‌ఈడీ స్ర్కీన్‌లో రాజన్న దర్శనం



భీమన్న సన్నిధిలో భక్తుల రద్దీ

వేములవాడ టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వేములవాడలో భక్తజనసంద్రమైంది. రాష్ట్ర నలుమూలల నుంచి దాదాపు 50వేలకు పైగాభక్తులు తరలివచ్చి స్వామివారికి మొక్కులు చెల్లించారు. భీమేశ్వరాలయంలో స్వామివారి దర్శనానికి రెండుగంటల సమయం పట్టింది. ఎల్‌ఈడీ స్ర్కీన్ లోనూ రాజన్న దర్శనానికి రద్దీఏర్పడింది. ఆలయ పరిసరాలన్నీ భక్తులతో కిక్కిరిసిపోయాయి. వేలాదిమంది భక్తులు తలనీలాలు సమర్పించారు. ఓ వైపు ఆలయ విస్తరణ పనుల్లో భాగంగా భీమన్నను భక్తులు స్వామివారిని దర్శించుకోవడానికి ఇబ్బందుల పాలయ్యారు. ఎల్‌ఈడీ స్ర్కీన్‌లో రాజరాజేశ్వర స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు. భీమేశ్వరస్వామి దేవస్థానంలో వేలాదిమంది భక్తులు కోడెల మొక్కులు చెల్లించారు. ఆలయంలో స్వామివారికి భక్తులు అభిషేక పూజలు చేశారు. నిత్యాన్నదాన సత్రం పై అంతస్తులో కల్యాణం, సత్యనారాయణస్వామివ్రతాలు నిర్వహించారు. అనేకమంది భక్తులు కుంకు మపూజలు, పెద్ద పల్లకి సేవలు చేపట్టి భక్తినిచాటారు. అనంతరం భీమేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. భీమన్న సన్నిధిలో క్యూలైన్‌లోనే ఆలయ ఇవో వెళ్లి భక్తుల సమస్యలు అడిగి తెలుసు కున్నారు. భీమేశ్వరస్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తులు బద్దిపోచమ్మకు బోనాలు సమర్పించారు.

కొండగట్టులో భక్తుల రద్దీ

మల్యాల : కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధికి సోమవారం సాయంత్రం నుంచి రాత్రివరకు వేలాదిగా భక్తులు చేరుకోవడంతో కొండంతా రద్దీగా మారింది. సమ్మక్క, సారలమ్మ జాతరకు ముందు సోమవారం వేములవాడ రాజన్నను దర్శించుకొని మంగళవారం కొండగట్టు అంజన్నను దర్శించుకోవడం ఆనవాయితీ కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వందలాది వాహనాల్లో భక్తులు కొండపైకి చేరుకున్నారు. దేవస్థానం పరిధిలోని సత్రాలు భక్తులతో నిండి పోగా, గదులు లేక చలిలో ఆరుబయట పడుకొని తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఈ సీజన్‌లో భక్తులు అధికసంఖ్యలో తరలివస్తారని తెలిసినప్పటికీ దేవస్థానం తరుపున కనీస సౌకర్యాలు కల్పించకపోవడం పట్ల స్థానికులు అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

● సెల్‌ఫోన్ అప్పగింత..

కొండగట్టు అంజన్న దర్శనానికి వచ్చిన హైదరాబాద్‌కు చెందిన విజయకుమార్‌రావు అనే భక్తుడు సెల్‌ఫోన్ పోగొట్టుకోగా అక్కడి పోలీసులకు దొరికింది. దీంతో విచారణ జరిపిన అనంతరం పోలీస్ అవుట్ పోస్టు ఏఎస్సై చిలుక శ్రీనివాస్ సెల్‌ఫోన్ భక్తుడికి అప్పగించారు.



కొండగట్టులో పార్కింగ్ స్థలంలో భక్తుల వాహనాలు

రాజుపేటలో దొంగల బీభత్సం

● బంగారం, వెండి, నగదు అపహరణ

గంభీరావుపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం రాజుపేట గ్రామంలో ఆదివారం దొంగలు బీభత్సం సృష్టించారు. తాళాలు వేసిన ఇళ్లలోకి చొరబడి బంగారు, వెండి ఆభరణాలతోపాటు నగదు ఎత్తుకెళ్లారు. సుద్ద దేవవ్వ, దిడ్డి మణెవ్వ, బండి లచ్చవ్వ, బండి వెంకట, దిడ్డి కిష్టయ్యల ఇళ్ల తాళాలు పగులగొట్టి దొంగతనానికి పాల్పడ్డారు. ఐదుఇళ్లలో దొంగలు చొరబడి దొంగతనానికి పాల్పడ్డప్పటికీ, రెండు ఇళ్ళలో మాత్రమే చోరీ జరిగింది. ఇండ్లకు తాళం వేసి కొందరు బంధువుల వద్దకు వెళ్లగా, మరి కొందరు శుభకార్యం నిమిత్తం ఇతర గ్రామాలకు వెళ్లారు. దేవవ్వ మాత్రం ఇంటికి తాళంవేసి పక్కనే ఉన్నవారి అక్కఇంట్లో నిద్రించింది. అయితే దేవవ్వ అక్క ఇంటికి గొళ్లెం పెట్టి దేవవ్వ ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. మరో ముగ్గురి ఇళ్ల తాళాలను దొంగలు పగుల గొట్టి లోనికి వెళ్లి దొంగతనానికి ప్రయత్నిస్తుండగా, సమీప ప్రజలు మేలుకుని కేకలు వేయ డంతో దొంగలు పారిపోయినట్టు తెలుస్తోంది. దేవవ్వ ఇంట్లో 4 తులాల బంగారు అభర ణాలు, 50 తులాల వెండి ఆభరణాలు, రూ. 50వేల నగదు ఎత్తుకెళ్లారు. మణెమ్మ ఇంట్లో 4తులాలన్నర బంగారం, 10తులాల వెండి. రూ.32వేల నగదు ఎత్తుకెళ్లారు. సంఘటన స్థలానికి సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రచారి వచ్చి పరిశీలించారు. అప్పట్లో నాగంపేటలో జరిగిన దొంగతనంపై కూడా డీఎస్పీ ఆరా తీశారు. క్లూస్ టీం, డాగ్ స్కాడ్ తనిఖీ చేశారు.

చోరీ కేసులో నిందితుడికి సంవత్సరం జైలు శిక్ష

సిరిసిల్ల రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): చోరీ కేసులో నిందితుడికి ఒక సంవత్సరం జైలు శిక్ష విధిస్తూ సిరిసిల్ల ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ సోమవారం తీర్పు వెల్లడించినట్లు సిరిసిల్ల పట్టణ సీఐ కృష్ణ తెలిపారు. సిరిసిల్ల పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టౌన్‌సీఐ మాట్లాడారు. సిరిసిల్లలోని సంజీవయ్యనగర్‌కి చెందిన దరిపల్లి రమేష్ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ యేడు ఏప్రిల్‌లో కుటుంబసభ్యులతో కలసి ఎల్లమ్మ దేవుని పండుగ చేసుకోవడానికి సొంత గ్రామమైన కనగర్తికి వెళ్లాడు. రమేష్ తమ్ముడు సురేష్ ఫోన్ చేసి ఇంట్లో దొంగలు పడ్డారని చెప్పగా రమేష్ వెంటనే ఇంటికి వచ్చి చూడగా బీరువా తాళాలు తెరిచి సామానులన్నీ చిందరవందరగా పడేసి ఉన్నాయి. బీరువాలో దాచిపెట్టిన 8తులాల బంగారు ఆభరణాలతో పాటు 20తులాల వెండి ఆభరణాలు చోరీ చేసినట్లు గుర్తించారు. దీంతో రమేష్ సిరిసిల్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్‌ఐ శేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా దొంగతనం చేసిన వడ్డేపల్లి సత్యం అనే వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్ తరలించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. తర్వాత కోర్టు మానిటరింగ్ ఎస్‌ఐ ఆధ్వ ర్యంలో కోర్టు కానిస్టేబుల్ వేముల నరేష్ ఆరుగరు సాక్షులను ప్రవేశ పెట్ట ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ చెలుమల సందీప్ వాదించారు. న్యాయమూర్తి ప్రవీణ్ నిందితుడు వడ్డేపల్లి సత్యంకు ఒక సంవత్సరం కఠిన కారాగార జైలుశిక్ష విధించినట్లు తెలిపారు.

రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులు



బాబును, ప్రణతిని అభినందిస్తున్న పాఠశాలల సిబ్బంది

కొడిమ్యాల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ప్రభుత్వజూనియర్ కళాశాలకు చెందిన కెబాబు కబడ్డీక్రీడల్లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ కె వేణు తెలిపారు. దీంతోకళాశాల సిబ్బంది విద్యార్థిని అభినందించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ బి నర్సయ్య, అధ్యాపకుడు నర్సయ్యసిబ్బంది ఉన్నారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు..

తిమ్మాపూర్: మండల కేంద్రంలోని మోడల్ కళాశాలలో ఎంపీసీ ఫస్ట్ ఇయర్ చదువుతున్న ప్రణతి జాతీయస్థాయి కబడ్డీజట్టుకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం.వనజ తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని ఫిజికల్ డైరెక్టర్ నాగరాజును ప్రిన్సిపాల్, అధ్యాపకులు, అభినందించారు.

బొంతకుంటపల్లిలో కొండచిలువ హతం

సుల్తానాబాద్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొంతకుంటపల్లిలో సోమవారం రైతులకు కొండచిలువ కనిపించింది. రైతులు పొలం పనుల్లో నిమగ్నమై ఉండగా, ఒక్కసారిగా మీదకు రావడంతో దానిని కర్రలతో కొట్టిచంపివేశారు. ఇటీవల పలుగ్రామాల్లో కొండచిలువ కనిపించడం, రైతులు, ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.



కొండచిలువతో గ్రామస్థులు

వైభవంగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



హోమం నిర్వహిస్తున్న పండితులు

కొడిమ్యాల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కొడిమ్యాల మండల కేంద్రంలోని లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వెంకటేశ్వరస్వామి వైభవంగా బ్రహ్మోత్సవాలు కొన సాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండవ రోజు సోమవారం వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో స్వామి వారికి పండితులు ఘనంగా ప్రత్యేక పూజలు చేసారు. ఆలయ ప్రాంగణంలో పరివార హోమం, దేవతా ఆహ్వానం కార్యక్రమాలను పండితులు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్మాణకమిటీ వారు, భక్తులు గ్రామస్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమాల్లో ఆలయ కమిటీసభ్యులు, గ్రామ ప్రముఖులు, భక్తులు వందలాదిగా పాల్గొన్నారు.

కన్నుల పండువగా నారికేళ దీపోత్సవ శోభాయాత్ర



శోభాయాత్రలో పాల్గొన్న మహిళలు

కరీంనగర్ కల్చరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నగరంలోని భగత్‌నగర్ అయ్యప్ప దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన నారికేళ దీపోత్సవ శోభాయాత్ర కన్నులపండువగా సాగింది. గోవిందపతి శ్రీవారి సేవా సమితి సహకారంతో శోభాయాత్ర చేపట్టారు. మహిళలు కొబ్బరి ముక్కల్లో దీపాలు వెలిగించి మంకమ్మతోట వేంకటేశ్వరాలయంలో పూజలు చేసి అయ్యప్ప ఆలయం వరకు శోభాయాత్ర నిర్వహించారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్‌కుమార్, నాయకులు మల్లికార్జున రాజేందర్, కటకం వెంకటరమణ, జీఎస్ ఆనంద్, అయ్యప్ప ఆలయ చైర్మన్ వై. అనిల్‌కుమార్‌గౌడ్, ఈవో కొన్న కాంతారెడ్డి, వేంకటేశ్వరాలయ ఈవో శ్రీనివాస్, గోవిందపతి శ్రీవారి సేవాసమితి అధ్యక్షుడు పాలవేడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

కరీంనగర్ కల్చరల్: దైవ కార్యక్రమాలతో సంతృప్తి, భగవదాశీస్సులు కలుగుతాయనే ఉద్దేశంతో బుధవారం సాయంత్రం అల్ఫోర్స్ ఈ-టెక్నో స్కూల్లో అయ్యప్ప మహా పడిపూజ నిర్వహిస్తున్నట్లు విద్యా సంస్థల ఛైర్మన్ డాక్టర్ నరేందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ అయ్యప్ప దీక్షాపరులు విజయవంతం చేయాలన్నారు.

గంగాధర: సకాలంలో లోపాలను గుర్తిస్తే పిల్లలో వచ్చే వ్యాధులను నివారించవచ్చని వైద్యాధికారి సురేష్ అన్నారు. సోమవారం గంగాధర మండలం బూరుగుపల్లి జడ్పీహెచ్ ఎస్‌లో ఆర్‌బీఎస్‌కే(రాష్ట్రీయ బాలస్వస్థ్) కార్యక్రమంలో భాగంగా 6 నుంచి పదో తరగతి విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యాధికారి ప్రతిభ, ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున్ పాల్గొన్నారు.

హుజూరాబాద్: హుజూరాబాద్ మండల విద్యాధికారి, డిప్యూటేషన్ పేరిట ఎం ఈవో కార్యాలయంలో బోధనేతర పను లు చేస్తున్న గోపాల్‌రెడ్డి అనే ఉపా ధ్యాయుడిపై ఆలిండియా స్టూడెంట్స్ బ్లాక్ తెలంగాణ రాష్ట్ర కన్వీనింగ్ కమిటీ మెంబర్ సూర్యకిరణ్ సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.

గన్నేరువరం: గన్నేరువరం నూతన తహసీల్దార్‌గా కోడం కనుకయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన తహసీల్దార్ జక్కని నరేందర్ హుజురాబాద్‌కు బదిలీ అయ్యారు. అక్కడ పనిచేసిన కనుకయ్యను గన్నేరువరం తహసీల్దార్‌గా నియమించారు.

వీణవంక: మండలంలోని చల్లూరు నుంచి మల్లారెడ్డిపల్లికి ఆర్‌అండ్‌బీ రోడ్డు, మాల్లారెడ్డిపల్లిలో సీసీ రోడ్లు మంజూరు చేయాలని వీణవంక బీజేపీ నాయకులు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు బత్తిని నరేష్ గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

చొప్పదండి: మండలంలోని రేవెల్లికి సంబంధించిన వార్డు సభ్యుల రిజర్వేషన్లు సక్రమంగా జరగలేదని, బీసీలకు ఒక్క స్థానం కూడా రిజర్వ్ చేయలేదని ఆర్డీవో మహేశ్వర్‌కు బీఆర్ఎస్ నాయకులు సోమవారం ఫిర్యాదు చేశారు. 8 వార్డుల్లో నాలుగు జనరల్, నాలుగు ఎస్సీలకు కేటాయించారన్నారు. బీసీలకు రెండు కేటాయించాలని కోరారు.

సుభాష్‌నగర్: లయన్స్‌క్లబ్ ఆఫ్ కరీంనగర్ స్మార్ట్‌సిటీ ఆధ్వర్యంలో చేపట్టిన సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా శాశ్వత ప్రాజెక్టును ఏర్పాటు చేశారు. సోమవారం స్థానిక జ్యోతినగర్‌లో పాథలాజికల్ ల్యాబ్‌ను ప్రారంభించారు. క్లబ్ జిల్లా గవర్నర్ సింహరాజు కోదండరాం, జిల్లా క్యాబినెట్ కోశాధికారి గాలిపెల్లి వెంకట్ పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారుల తీరు మారదా?

- వీణవంకలో సమయ పాలన పాటించని వైనం
- సమావేశాల పేరిట కార్యాలయానికి డుమ్మా
- సర్టిఫికెట్ల కోసం ప్రజల ఎదురు చూపులు
- కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు



వీణవంక తహసీల్దార్ కార్యాలయం ఎదుట అధికారుల కోసం ఎదురు చూస్తున్న ప్రజలు

వీణవంక, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వీణవంక మండల రెవెన్యూ అధికారుల తీరు మారడం లేదు. ఉన్నతాధికారులు ఎన్నిసార్లు మందలించినా ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. సమావేశాలపేరిట కార్యాలయానికి డుమ్మా కొడుతున్నారు. వివిధ పనులు, సమస్యలపై వస్తున్న ప్రజలను కార్యాలయం చుట్టూ నెలల కొద్దీ తిప్పు కుంటున్నారు. మండలంలోని కనపర్తి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కోసం దాదాపు ఆరు నెలలుగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాడు. సర్టిఫికెట్ విషయమై అధికారులను అడిగినా తమకేమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారని బాధితుడు వాపోతున్నాడు. ప్రతీ సర్టిఫికెట్‌కు ఎంతో కొంత ముట్టంది కొంతమంది అధికారులు సంతకాలు పెట్టడంలేదని సమాచారం. గతంలో ఓ భూమి రిజిస్ట్రేషన్ వ్యవహారంలో కలెక్టర్ కార్యాలయ సిబ్బంది మొత్తాన్ని బదిలీ చేసినా అధికారుల తీరుమారడం లేదని మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండల రెవెన్యూ అధికారులపై ఉన్నతాధికారుల నిఘా కొరవడడంతో కార్యాలయ సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని పేర్కొంటున్నారు. మరోవైపు సాదా బైనామా దరఖాస్తుల కోసం కొంతమంది దళారులను నియమించుకొని పరిష్కరిస్తున్నట్లు సమాచారం. ఇటీవల ఓ రైతు తన భూ సమస్య పరిష్కారం కాకపోవడంతో అధికారుల తీరుపై ఏసీబీని ఆశ్రయించినట్లు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా జవాబుదారీగా లేని అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని మండలవాసులు కోరుతున్నారు.

ఆగయ్య సేవలు మరువలేనివి

కరీంనగర్ టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మున్నూరుకాపు సంఘం బలోపేతానికి జిల్లా మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ట్రస్టు బోర్డు సభ్యుడు, టీడీపీ సీనియర్ నాయకుడు కల్యాడపు ఆగయ్య చేసిన సేవలు మరువలేనివని, ఆయన మృతి తీరనిలోటని జిల్లా మున్నూరుకాపు విద్యార్థి వసతిగృహం ట్రస్టు బోర్డు ఛైర్మన్ బొమ్మ శ్రీరాంచక్రవర్తి అన్నారు. సోమవారం నగరంలోని జిల్లా మున్నూరుకాపు విద్యార్థి వసతిగృహంలో ట్రస్టు ఆధ్వర్యంలో కల్యాడపు ఆగయ్య సంతాపసభను నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు బొమ్మ రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి, మాజీ కార్పొరేటర్ నలువాల రవీందర్‌పటేల్, అర్బన్ బ్యాంకు ఛైర్మన్ కర్ర రాజశేఖర్, సంఘ నాయకులు కాశెట్టి శ్రీనివాస్, కోల సంపత్‌రెడ్డి, బొమ్మరాతి రాజేశం, ఎడ్ల మధూకర్, అనురాసుకుమార్, ముప్పిడి బాలకృష్ణ, మ్యాడం శివకాంత్, ఆకుల యాదయ్య, ఒంటెల కృష్ణ, పసుల మహిపాల్, ఆది మల్లేశం, ఎలిమిల కిషన్, బండ ప్రశాంత్ దీపక్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు శ్రీచైతన్య విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులు

తిమ్మాపూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీచైతన్య డిఫెన్స్ అండ్ స్పోర్ట్స్ అకాడమీ విద్యార్థులు ఎస్‌జీఎఫ్ఐ రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైనట్లు విద్యా సంస్థల ఛైర్మన్ ముద్దసాని రమేష్‌రెడ్డి తెలిపారు. అండర్ 19లో బి.శివతేజ 60కిలోల విభాగం, పి.చంద్రప్రకాశ్ 65 కిలోలు, వై.యశ్వంత్ 71కిలోలు, ఎస్.అక్షిత్ 79కిలోలు, కె.ఉదయ్ రోషన్ 88కిలోలు, రాకేష్ 98కిలోల విభాగాల్లో జిల్లా స్థాయిలో స్వర్ణ పతకాలు సాధించినట్లు తెలిపారు. త్వరలో హైదారాబాద్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా రమేష్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులను అభినందించారు. అకాడమి ప్రిన్సిపాల్ పల్లె శ్యాంసుందర్ రెడ్డి, డీన్ జగన్మోహన్ రెడ్డి, ఏజీఎం శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ పి.శ్రీనివాస్, కోచ్ పిడుగు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విద్య, వైద్య రంగాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



హుజూరాబాద్‌లో భూమిపూజ చేస్తున్న వొడితెల ప్రణవ్

హుజూరాబాద్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్య, వైద్య రంగాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని హుజూరాబాద్ నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ అన్నారు. సోమవారం హుజూరాబాద్ పట్టణం కేసీ క్యాంపులోని మహాత్మా జ్యోతిభాపూలే పాఠశాలలో రూ.35 లక్షలతో రెండు అదనపు తరగతి గదుల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశాలు

జమ్మికుంట రూరల్: జమ్మికుంట మండలం గండ్రపల్లిలో పైలట్ ప్రాజెక్ట్ కింద తీసుకున్న ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశాలకు సోమవారం వొడితల ప్రణవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ రానున్న స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను దీవించాలని కోరారు. నాయకులు దేశిని కోటి, సుంకరి రమేష్, పర్శరాములు, సాయిని రవి, పూదరి రేణుక-శివకుమార్, సజ్జు, తదితరులు పాల్గొన్నారు.

కల్వరి టెంపుల్‌లో ముందస్తు క్రిస్మస్ వేడుకలు



కేక్ కట్ చేస్తున్న చర్చి పాస్టర్, అతిథులు

హుజూరాబాద్‌రూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగాపూర్ కల్వరి టెంపుల్ చర్చిలో పాస్టర్ డాక్టర్ పీఆర్ నెల్సన్ ఆధ్వర్యంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా రెవరెండ్ కె.సీమోను బాబు, డాక్టర్ జైదా ప్రకాష్ దైవ సందేశాన్ని వినిపించారు. అనంతరం జయన్న ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గుడిపాటి జయపాల్‌రెడ్డి హాజరవగా వారి సేవలను పాస్టర్ వివరించారు. ఈ సందర్భంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకురాలు పుష్పలత తదితరులు ఉన్నారు.

జాతీయస్థాయి పోటీలకు జిల్లా క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి అండర్-19 ఎస్‌జీఎఫ్ చదరంగం పోటీలకు జిల్లాకు చెందిన జీనియస్ చెస్ అకాడమీ క్రీడాకారులు ఎంపికయ్యారు. కర్ణాటకలో వచ్చే నెలలో నిర్వహించనున్న పోటీలకు బాలుర విభాగంలో సుప్రీత్, సాత్విక్, బాలికల విభాగంలో శ్లోకా యుక్తి, మెగా సంహిత ఎంపికైనట్లు చెస్ అకాడమీ డైరెక్టర్ కంకటి అనూప్ కుమార్ తెలిపారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి చదరంగం ప్రతిభచాటినట్లు చెప్పారు. క్రీడాకారులను అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు కంకటి కనకయ్య, అకాడమీ కో-ఆర్డినేటర్ సృజన్ కుమార్, కోచ్‌లు అనూప్, అభిరామ్, రేవిక్, అరుణ్, ప్రభ, శ్రీనిజ, స్వాతి, సిరి మేఘన అభినందించారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి

చిగురుమామిడి,నవంబరు 24 (ఆంధ్ర జ్యోతి): ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కొత్త శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ మండల శాఖ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. మండలంలోని పెండింగ్ పనులను వెంటనే చేపట్టాలని ఎంపీవో కిరణ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో అనేక అవకతవకలు జరిగాయని ఆరోపించారు. మహిళా సంఘాల సభ్యులకు చీరలు ఇస్తే మిగతావారి సంగతి ఏమిటని ప్రశ్నించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మండల అభివృద్ధి పనులపై సమీక్షించాలన్నారు. మండలంలోని ఉల్లంపల్లి, రేకొండ- ఎగ్లాస్‌పూర్, రామంచ-మూదిమాణిక్యం గ్రామాలతో మరికొన్ని గ్రామాల్లో పనులు ఎందుకు ప్రారంభించడం లేదన్నారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య, సింగిల్ విండో ఛైర్మన్ వెంకటరమణారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రాజిరెడ్డి పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

శంకరపట్నం: శంకరపట్నం మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంట మహిపాల్ ఆధ్వర్యంలో నిలిచిన అభివృద్ధి పనులను పూర్తి చేయాలని జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కేశవపట్నం వాగుపై బ్రిడ్జీ, అసంపూర్తిగా నిలిచిన అరుంధతి కల్యాణ మండపం, అర్కండ్ల వాగుపై హైలెవెల్ బ్రిడ్జి, కల్వల చెరువు మరమ్మతును పూర్తి చేయాలన్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. మాజీ జడ్పీటీసీలు, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

వైద్యుల అంజన్‌కుమార్‌కు లయన్స్‌క్లబ్ అభినందనలు

కరీంనగర్ అర్బన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ కరీంనగర్ కార్పొరేషన్ అధ్యక్షుడిగా నియామకమైన వైద్యుల అంజన్ కుమార్‌ను సోమవారం అసోసియేషన్ ఆఫ్ అలయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్, ఇంటర్నేషనల్ డైరెక్టర్ డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో డిస్ట్రిక్ట్ 137 ఏ లీడర్స్ అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అసోసియేషన్ ఆఫ్ అలయన్స్‌క్లబ్స్ నిర్వహించే సేవా కార్యక్రమాలకు తోడ్పాటును అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్, ఇంజనీర్ కోల అన్నారెడ్డి, ఏసీబీ జిల్లా గవర్నర్ అచీవర్స్ వెంకటేశ్వర్లు జిల్లా క్యాబినెట్ సెక్రెటరీ పులాల శ్యామ్, పండుగ నాగరాజు, డిస్ట్రిక్ పీఆర్‌వో విద్యాసాగర్‌రెడ్డి, హైమవతి మహేష్, అడ్వకేట్ సుద్దపల్లి ప్రసాద్, కుమారస్వామి, నాగేశ్వర్, గాలిపల్లి శ్రీనివాస్, అడ్వకేట్ నాజియా, అడ్వకేట్ రేణుక తదితరులు పాల్గొన్నారు.

దేశాన్ని విశ్వ గురు స్థానంలో నిలుపుదాం



ప్రతిజ్ఞ చేస్తున్న నాయకులు

కరీంనగర్ కల్చరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : గంజాయి, మాదక, మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ దేశాన్ని విశ్వగురు స్థానంలో నిలుపుదామని ఆర్ఎస్ఎస్ జిల్లా సహ సంఘ చాలక్ ఎలగందుల సత్యనారాయణ పిలుపునిచ్చారు. సోమవారం గాంధీ రోడ్ రామాలయం నుంచి బస్టాండ్ వెనుక ఆర్ఎస్ఎస్ కార్యాలయం వరకు విశ్వహిందూ పరిషత్, భజరంగదళ్ ఆధ్వర్యంలో నశాముక్త్ 2కే రన్‌ను ప్రారంభించారు. భజరంగదళ్ జోనల్ కన్వీనర్ తోట ప్రదీప్, వీహెచ్‌పీ కార్యదర్శి ఆదిమూలం విద్యాసాగర్, సహ కార్యదర్శి తోట రాజేందర్, కోశాధికారి అంజయ్య, భజరంగదళ్ జిల్లా కన్వీనర్ కన్నం శంకర్, జిల్లా సహ సంయోజక్ రాజేందర్, నగర సంయోజక్ మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

42శాతం రిజర్వేషన్ కల్పించాలి

హుజూరాబాద్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బీసీ జేఏసీ ఆధ్వర్యంలో బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్ కల్పించాలని సోమవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వెంకన్న, జనార్ధన్, శ్రీనివాస్, ప్రభాకర్, నారాయణ, రఘుచారి, సాగర్, మధుకర్, ప్రవీణ్, సమ్మయ్య, రజనీకాంత్ పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు సన్మానం

కరీంనగర్ అర్బన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా నియామకమైన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియామకమైన వైద్యుల అంజన్ కుమార్‌ను సోమవారం కరీంనగర్‌లో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, వీఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి సన్మానించారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ సత్యమన్న సారథ్యంలో జిల్లాలో పార్టీకి పూర్వ వైభవం తేవడానికి అందుబాటులో ఉంటామన్నారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్‌పార్టీ వివిధ విభాగాల కార్యకర్తలు, వీఎస్ఆర్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.



జ్ఞాపిక అందజేస్తున్న అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి

ఇందిరమ్మ చీరల పంపిణీ



పంపిణీ చేస్తున్న జిల్లా అదనపు డీఆర్డీవో రవి కుమార్

కరీంనగర్ రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలంలోని గ్రామాల్లో స్వశక్తి సంఘాల మహిళలకు సోమవారం చీరల పంపిణీ చేపట్టారు. మండలంలో మొత్తం 6,294 స్వశక్తి సంఘాల సభ్యులు ఉండగా మొదటి విడత 5,760 చీరలు మంజూరు చేసింది.

తిమ్మాపూర్: మండలంలోని నుస్తులాపూర్ రైతు వేదికలో జిల్లా అదనపు డీఆర్డీవో జె.రవి కుమార్ అధికారులు, కాంగ్రెస్ నాయకులతో కలిసి చీరల పంపిణీ ప్రారంభించారు. తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీవో రాజీవ్ మల్హోత్ర, కాంగ్రెస్ అధ్యక్షుడు రమేష్ పాల్గొన్నారు.

ఇల్లందకుంట: ఇల్లందకుంట మండలం శ్రీరాములపల్లిలో సీతారామచంద్రస్వామి ఆలయ ఛైర్మన్ ఇంగిలే రామారావు సోమవారం మహిళలకు చీరలను పంపిణీ చేశారు. గ్రామ శాఖ అధ్యక్షుడు సురేష్, మాజీ ఉపసర్పంచ్ రవి పాల్గొన్నారు.

గన్నేరువరం: మండల కేంద్రంలోని రైతువేదికలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ పులి కృష్ణ చీరల పంపిణీ ప్రారంభించారు. తహసీల్దార్ కనుకయ్య, ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, ఏపీఎం శ్రీనివాస్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

భగత్‌నగర్: కొత్తపల్లి మండలం నాగులమల్యాలలోని మహిళా స్వశక్తి సంఘాలకు ఇందిరా మహిళా శక్తి చీరలను కాంగ్రెస్ నాయకులు సోమవారం పంపిణీ చేశారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మల్యాల రాజగౌడ్, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి అమీర్‌శెట్టి కనకయ్య, గ్రామ అధ్యక్షుడు నాంపల్లి లక్ష్మయ్య పాల్గొన్నారు.

నిబంధనలకు నీళ్లు

(5వ పేజీ తరువాయి)

వినియోగిస్తున్నారా గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు.

● నగరంలో 200 వాణిజ్య సముదాయాలు

నగరంలో 200 వరకు వాణిజ్య సముదాయాలు, వాణిజ్య, వ్యాపార సంస్థల భవనాలు ఉన్నాయి. చాలా మేరకు నిబంధనలను పాటించడం లేదని, హాస్పిటల్ సెల్యూలర్లు, షాపింగ్ మాల్స్‌కు సెల్లార్లలో గదులను నిర్మించుకొని వాణిజ్య, వ్యాపార అవసరాలకు వినియోగిస్తుండడంతో వాహనాలను రోడ్లపైనే నిలుపుతున్నట్లు గుర్తించారు. రెండు రోజుల క్రితం కమిషనర్ ప్రఫుల్‌దేశాయ్, టౌన్‌ప్లానింగ్ అధికారులతో కలిసి వివిధ ప్రాంతాల్లోని 20 కమర్షియల్ బిల్డింగ్స్‌ను పరిశీలించారు. వాటిలో 17 సెల్లార్లను ఇతర అవసరాలకు వినియోగిస్తున్నట్లు గుర్తించారు. సోమవారం టౌన్‌ప్లానింగ్ అధికారులు 44 వాణిజ్య భవనాలను పరిశీలించగా 24 భవనాల్లోని సెల్లార్లను ఇతర అవసరాల కోసం వాడుతున్నట్లు గమనించారు. దీంతో ఆయా భవనాల యజమానులు, నిర్వాహకులకు సెల్లార్ నిబంధనలపై అవగాహన కల్పించారు. వారంరోజుల్లోగా ఇతర నిర్మాణాలను తొలగించి వాహనాల పార్కింగ్‌కు మాత్రమే వినియోగించుకోవాలని సూచిస్తూ నోటీసులు జారీ చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వాణిజ్య సముదాయాలు, భవనాల ఎదుట రోడ్లపై వాహనాలను నిలుపవద్దని, నిబంధనలను తప్పకుండా పాటించాలని, లేకపోతే మున్సిపల్ చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పేదలకు మెరుగైన వైద్య సేవలందించాలి

(5వ పేజీ తరువాయి)

వ్పుడే వాళ్లలో భయం ఉంటుందన్నారు. జమ్మి కుంట రైల్వేస్టేషన్‌ను త్వరలోనే ఆధునీకరిస్తామని, అందుకు సంబంధించిన ప్రతిపా దనలు సిద్ధమయ్యాయని తెలిపారు. స్పోర్ట్స్ స్టేడియం నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సూపరింటెండెంట్ పారిపెల్లి శ్రీకాంత్ రెడ్డి, తహసీల్దార్ వెంకటరెడ్డి పాల్గొన్నారు.

● ప్రతీ చిన్నదానికి పెద్దాసుపత్రికి పంపించొద్దు..

ప్రతి చిన్నదానికి రోగులను పెద్దాసుపత్రికి పంపించొద్దని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన అనంతరం ఆయన వైద్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి సూపరింటెండెంట్ పారిపెల్లి శ్రీకాంత్‌రెడ్డి మట్లాడుతూ ప్రతి వైద్య పరికరాన్ని రోగుల కోసం తప్పకుండా ఉపయోగిస్తామని ఇంచా ర్జ్ అన్నారు. తమకు మరిన్ని వైద్య పరికరాలు, వైద్యులను ఇస్తే అన్ని రోగులకు నాణ్యమైన సేవలు అందిస్తామని చెప్పారు. అనంతరం బండి సంజయ్‌కుమార్ మాట్లాడుతూ ఆసుప త్రికి అవసరమైన అన్ని సౌకర్యాలు సమకూరుస్తామని హామీ ఇచ్చారు. కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ వారానికి రెండుసార్లు గైనకాలజిస్ట్, అనస్తేషియా, రేడియాలజిస్టును కేటాయిస్తామని అన్నారు. విధులపై నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. నెల రోజులకు సమీక్ష సమావేశం ఏర్పాటు చేస్తామని, అప్పటికి ఆసుపత్రిలో రిజల్ట్ కనిపించాలని వైద్యులకు సూచించారు.

చెకుముకి పోటీల్లో అల్ఫోర్స్ విద్యార్థులకు ప్రథమస్థానం



అభినందిస్తున్న నరేందర్‌రెడ్డి

భగత్‌నగర్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండల స్థాయి చెకుముకి పోటీల్లో అల్ఫోర్స్ విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. సోమవారం కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాలలో ప్రథమ స్థానంలో నిలి చిన విద్యార్థులను విద్యాసంస్థల అధినేత డాక్టర్ నరేందర్‌రెడ్డి అభినందిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల స్థాయిలో ఒం టెల శివస్మరణ్‌రెడ్డి, ఎస్.రిశాల్, కార్తికేయలు ప్రతిభ కనబర్చడం అభినందనీయమన్నారు.

ప్లాస్టిక్ దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు

కరీంనగర్ టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నగరంలోని టవర్‌సర్కిల్ ప్రాంతంలోగల పలు ప్లాస్టిక్ దుకాణాలు, జనరల్ స్టోర్స్‌లో మున్సిపల్ అధికారులు ఆకస్మిక తనిఖీ చేశారు. పెద్ద మొత్తంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ లభ్యం కావడంతో సంబంధిత దుకాణాల యజమానులకు రూ.17వేల జరిమానా విధించారు.

విద్యార్థుల జీవితాలతో చెలగాటం

గంగాధర, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటమాడుతోందని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆరోపించారు. సోమవారం చొప్పదండి నియోజకవర్గ మహాత్మా గాంధీ బాలికల గురుకుల పాఠశాలను సందర్శించారు. ప్రభుత్వం గురుకులాలను పట్టించుకోవడంలేదని ఆరోపిం చారు. మాజీ సర్పంచులు కంకణాల విజేందర్‌రెడ్డి, దామోదర్, నవీన్‌రావు, దూళం శంకర్‌గౌడ్ పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించండి

కరీంనగర్ టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వివిధ వ్యాపార, వాణిజ్య సంస్థల యజమానులు, నిర్వాహ కులు విధిగా ట్రేడ్ లైసెన్సులు తీసుకోవాలని, సకాలంలో ఫీజులను చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్‌దేశాయ్ కోరారు. సోమవారం మార్కెట్ ప్రాంతంలో అధికారులతో కలిసి ట్రేడ్ లైసెన్సు ఫీజు కలెక్షన్‌ను తనిఖీ చేశారు.

నల్ల చట్టాలను రద్దు చేయాలి

భగత్‌నగర్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మూడు వ్యవసాయ నల్ల చట్టాలను కేంద్రంప్రభుత్వం రద్దు చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వర్ణ వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని ముకుందలాల్ మిశ్రా భవన్‌లో నిర్వహించిన ప్రజా సంఘాల జిల్లా అధ్యక్ష కార్యదర్శుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జిల్లా కేంద్రాల్లో నవంబరు 26న నిరసనలు తెలపనున్నట్లు చెప్పారు.

సరస్వతీ శిశుమందిర్‌లో సప్తశక్తి సంగం

కరీంనగర్ టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శ్రీసరస్వతీ శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా సప్తశక్తి సంగం పేరుతో సోమవారం మహిళా చైతన్య కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యవక్తలుగా అనఘా వెంకట లక్ష్మి, వల్లూరు అలివేలు మంగ సందేశమిచ్చారు. మాజీ కార్పొరేటర్ జయశ్రీ, రామోజు ధనలక్ష్మి, కమిటీ కార్యదరి అన్నారెడ్డి పాల్గొన్నారు.

ఢిల్లీకి తరలిన నాయకులు

సుభాష్‌నగర్/గంగాధర, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): జాతీయ మాల మహా నాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ ఈనెల 26న తలపెట్టిన హలో మాల..ఛలో ఢిల్లీ కార్యక్రమానికి నాయకులు సోమవారం తరలి వెళ్లారు. రాష్ట్ర ప్రధానకార్యదర్శి మెడి అంజయ్య, జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజు, జిల్లా అధ్యక్షుడు రాజు, చొప్పదండి ఇన్‌చార్జి చంద్రయ్య, సోషల్ మీడియా కోఆర్డినేటర్ అజయ్, గంగాధర మండలాధ్యక్షుడు తాళ్ల సురేష్ ఉన్నారు.

రైతులను నట్టేట ముంచిన రాష్ట్ర ప్రభుత్వం

మానకొండూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రప్రభుత్వం రైతులను అన్ని రంగాల్లో నట్టేట ముంచిందని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మానకొండూర్‌లోని పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. పత్తి రైతులు ఎంత దిగుబడి సాధించిన ఏడు క్వింటాళ్ల మాత్రమే కొనుగోలు చేస్తామనడం రైతులను మోసం చేయడమేనన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఇంకా 60 శాతం ధాన్యం ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. నియోజకవర్గంలోని రోడ్లన్నీ దెబ్బతిన్నాయని, మరమ్మతుకు ఆందోళనలు చేపట్టినా స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పట్టించుకోవడం లేదన్నారు. మాజీ జడ్పీటీసీ తాల్లపల్లి శేఖర్‌గౌడ్, రాష్ట్ర నాయకులు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, శాతరాజు యాదగిరి, అశోక్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.